శ్మశానానికి దారేదీ..?

- అంతిమ యాత్రకు తప్పని ఇబ్బందులు
- ఆ నలుగురూ పాడె మోయలేని దుస్థితి
- రెండు కాలనీలకు ఒకే శ్మశాన వాటిక
- ముళ్ల కంపతో నిండుకున్న వైనం
- రోడ్డు వేయించాలంటున్న స్థానికులు



ముళ్ల కంపతో నిండి అధ్వానంగా ఉన్న శ్మశానం



శ్మశానానికి వెళ్లే దారి ఇదీ..

రాజుపాలెం: అంత్య క్రియలకు ఆ కాలనీల నివాసులు నానా అవస్థలు పడుతున్నారు. శ్మశానానికి వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న కొద్ది దారి బురద, ముళ్ల కంపతో అల్లుకుని పోయింది. క్యూ కట్టి నట్లుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పాడెను మోసే ఆ నలుగురూ ముళ్ల కంపను తొక్కుటుంటూ వెళ్లాల్సిందే. ఇక వర్షం వచ్చినప్పుడు పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. మండలంలోని ఇనిమెట్ల గ్రామంలోని రెండు ఎస్సీ కాలనీల దుస్థితి ఇది. ఈ రెండు కాలనీలకు సంబంధించి గ్రామానికి సమీపంలో వాగు అవతల ఒడ్డున ఏడెకరాల శ్మశానవాటిక స్థలం ఉంది. ఇందులోనే శతాబ్దం నుంచి మృత దేహాలను దహనం, ఖననం చేస్తున్నారు. ఇప్పుడు శ్మశానమంతా ముళ్ల కంపతో నిండుకుని పోయింది. ఖననానికి ఎక్కడో కొద్దిపాటి స్థలం వెతుక్కోవాల్సి వస్తోంది. రెండు కాలనీల్లో సుమారు 600 గృహాలు, 1,800 జనాభా ఉంది. మనిషి చనిపోతే శ్మశానానికి తీసుకుని వెళ్లడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో నడుము లోతు ఉన్న వాగు దాటాలంటే అవస్థలు పడేవారు. అనంతరం చప్టా వేశారు కానీ, దారి మాత్రం వేయలేదు. శ్మశాన వాటికలోని నీటి బోరు కూడా కొన్ని నెలల నుంచి పనిచేయక పోవడంతో నీళ్లకు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి, రోడ్డు ఏర్పాటు చేసి, అధ్వానంగా ఉన్న శ్మశాన వాటికను బాగు చేయాలని కోరుతున్నారు.

వృద్ధులకు ఇబ్బందులు



నాకు 75 ఏళ్లు. నాలాంటి వృద్ధులు అంతిమ యాత్రలో స్మశానం వరకు వెళ్లాలంటే లేక ఇబ్బందులు పడుతున్నారు. ఖననం చేసే సమయంలో మట్టి వేయాలనే ఆశ ఉన్నా శ్మశానాకి వెళ్లలేక పోతున్నాం. అక్కడున్న చేతి పంపునకు మరమ్మతులు చేపట్టాలి. రోడ్డు వేయించాలి.

– ముప్పాళ్ల బొర్రయ్య, వృద్ధుడు

అనేక సార్లు అధికారులను కోరాం



గతంలో శ్మశాన వాటికకు రోడ్డు కావాలని అనేక సార్లు అధికారులకు విన్నవించాం. ఉన్న కొద్దిపాటి దారిలో ఒకరి వెంట ఒకరు వెళ్లాల్సి వస్తోంది. రెండు కాలనీలకు ఒకే శ్మశానం ఉంది. ప్రభుత్వం పరిశీలించి రహదారి వేయాలి.

– లింగాల పున్నారావు, కాలనీవాసి.

క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సదస్సుకు తరలిరండి



క్రోసూరు: గుంటూరులో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సదస్సుకు మాదిగ, ఉప కులాల ప్రజలు పాల్గొనాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పిలుపునిచ్చారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాయంత్రం 4 గంటల నుంచి సదస్సు జరుగుతుందని, ఇందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరువుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగం దేవదాసు మాదిగ, వేమవరపు జీవన మాదిగ, కంచర్ల జానుబాబు మాదిగ, కృపారావు, సుల్తాన్ మాదిగ, దుద్దుల అక్కులు మాదిగ, దానియేలు మాదిగ, యూసఫ్ మాదిగ, మరిదాస్ మాదిగ, కృపారావు మాదిగ, ఏసు మాదిగ, ప్రభుదాస్ మాదిగ పాల్గొన్నారు.

సామాజిక వేత్త సీకే రావు మృతి



అచ్చంపేట: ప్రముఖ సామాజిక వేత్త, మాజీ సైనికోద్యోగి చల్లా కోటేశ్వరరావు (60) ఆదివారం మృతి చెందారు. ఆయన భార్య చల్లా అనుపకళ నియోజకవర్గ టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. ఆయన కొంత కాలంగా పెరాలసిస్‌తో బాధపడుతున్నారు. కోటేశ్వరరావు మృతి పట్ల అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిల్కా చంద్రయ్య, సర్పంచ్ కంబాల వీరబాబు, షేక్ జాని, మాజీ సర్పంచ్ టీవీఎస్ మల్లికార్జునరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నల్లమేకల వెంకటేశ్వర్లు, గిరిబాబు సంతాపం తెలిపారు

వైభవంగా నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో శ్రీనీలంపాటి అమ్మవారి తిరునాళ్లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని పురాతన బావి నుంచి బాలికలు మేళతాళాల నడుమ జల బిందెలను ఊరేగింపుగా తీసుకొచ్చి రాళ్ల పుట్ట వద్ద అభిషేకాలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, గాజులు, పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గుంటూరుకు చెందిన రామిరెడ్డి శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు, వారి శిష్య బృందంతో ఘనంగా వేద పండితులు రావిపాటి సాయి భరత్ పూజలు నిర్వహించారు. మండలంలోని మతుకుమల్లి, గంటావారిపాలెం గ్రామాలకు చెందిన భక్త బృందం భజన, తిరుమల–తిరుపతి దాస సాహిత్య చెరుకూరి హనుమంతరావు సారథ్యంలో మహిళలు కోలాటం నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు కమిటీ సభ్యులు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని హరిబాబు, కేతేపల్లి వెంకటేశ్ పర్యవేక్షించారు.

సాగరమాత ఆలయంలో ప్రార్థనలు

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవరూపాన్ని ధరించి సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధి విధానాలను వెలుగులోకి తెచ్చారని వెల్లడించారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచివ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ఐనవోలుకు చెందిన పలువురు యువకులను ఐనవోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి 10 వాహనాలను స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు. పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదానికి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

సత్తెనపల్లి: జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ఈ నెల 26న జరిగే కార్మిక, రైతు, కౌలు రైతుల, వ్యవసాయ కూలీల ధర్నా ధర్నాను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. పుతుంబాక భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసన దేశ వ్యాప్తంగా కార్మిక, రైతు, కౌలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త పిలుపు మేరకు ఈ ఉద్యమం జరుగుతుందన్నారు. 200 రోజుల పని దినాలు, కనీస వేతనాల చట్టం అమలు, పంటలకు మద్దతు ధర, కౌలు రైతులకు రాయితీల అమలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కార సాధనకు భారీ ప్రదర్శన జరుగుతుందని, అనంతరం కలెక్టరేట్ వద్ద బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.బాలకృష్ణ ఉన్నారు.

తెలుగు భాషపై ఆసక్తి పెంచాలి

పెదకూరపాడు: సాహిత్యమే భాషకు శ్వాసని, పిల్లలకు తెలుగు భాషపై ఆసక్తి పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్, ప్రజా కవి దర్శి శేషారావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం, సెమినార్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ తెలుగు భాషకు సేవ చేసిన కవులు, రచయితల గురించి నేటితరం తెలుసుకోవాలన్నారు. కవిత్వం సమాజాన్ని మేల్కొల్పుతోందని, రచనలు జన జాగృతికి తోడ్పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కొరప్రాటి వాణి, ఉపాధ్యాయులు పీవీడీ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

- **క్రోసూరు:** స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ ఆదివారం విద్యార్థులకు పరుగు పందెం, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. పుస్తక పఠనం తప్పని సరి అని తెలిపారు. విద్యార్థులకు చిన్నతనం నుంచి నైతిక విలువలు నేర్పాలని చెప్పారు. విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమావేశం



కళాశాల యాజమాన్యాన్ని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కళాశాలతో తమ అనుభవాన్ని పలువురు పంచుకున్నారు. కళాశాల అభివృద్ధిలో, న్యాక్ గ్రేడ్ సాధించడంలో పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయమని యాజమాన్యం పేర్కొంది. అనంతరం కళాశాల యాజమాన్యాన్ని పూర్వ విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డి. శివఫణీంద్ర, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పాల్గొన్న మాచర్ల, మిర్యాలగూడెం ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి

రెంటచింతల: దైవసంకల్పంతోనే గోలి గ్రామంలో అయప్పస్వామి ఆలయనిర్మాణం జరుగుతున్నట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం గోలి గ్రామ సమీపంలో అయప్పస్వామి ఆలయానికి ఆయన మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. అయ్యప్పస్వామి కరుణాకటాక్షాల కోసం భక్తులు స్వామిమాలను ధరించి 41రోజులపాటు దీక్ష తీసుకుంటున్నారన్నారు. గ్రామస్తులు సమష్టిగా కృషిచేసి ఆలయ నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మాచర్ల నియోజక వర్గంలో నాలుగు రహదారులకు ప్రభుత్వం రూ.117 కోట్లు మంజూరు చేసిందన్నారు. సత్రశాల – అడివిదేవులపల్లి, వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు – మద్దిమడుగు మధ్య కృష్ణానదిపై రెండు వంతెనలు నిర్మించినట్లయితే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సిహెచ్ అబ్బిరెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వర్షానికి నేల వాలిన వరి పైరు



రొంపిచర్ల: మండలంలో ప్రస్తుత తరుణంలో నెలకొన్న వాతావరణం వరి రైతాంగానికి ఇబ్బందిగా మారింది. శనివారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి పైరు అక్కడక్కడా నేలవారింది. ముఖ్యంగా విప్పర్ల, వి.రెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో సాగు చేసిన వరి పైరులో ఈ పరిస్థితి నెలకొంది. బిర్రు పొట్టపై ఉన్న నేలవారిన పైరు దెబ్బతినకుండా నాలుగు, ఐదు మొక్కలను ఒకటిగా చేసి కట్టలు కడుతున్నారు. ఇలా చేయటం వల్ల వరి పైరు నిలబడి కంకులు వస్తాయని మాగాణి రైతుల నమ్మకం.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎగ్జామ్స్ కో–ఆర్డినేటర్ షేక్ సుభాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్, వీవింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సులుంటాయని పేర్కొన్నారు. ఆఫీస్ ఆఫ్ ది గవర్నమెంట్ ఎగ్జామినేషన్ వీటిని నిర్వహిస్తుందని తెలిపారు. తొమ్మిది, ఆపై చదువు తప్పనిసరిగా చదివి ఉండాలన్నారు. ఈ నెల 30న ఆఖరి గడువని, డిసెంబర్ 10వ తేదీ వరకు రూ.50, 20వ తేదీ వరకు రూ.75 ఫైన్‌తో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. డిసెంబర్ 20లోపు జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. వివరాలకు షేక్ సుభాని 85550 73219 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

హైందవ 'శంఖారావం' జయప్రదానికి పిలుపు

ముప్పాళ్ల: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, సమాజ రక్షణ కోరుతూ జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం సభను అధిక సంఖ్యలో విచ్చేసి, జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ నాయకులు చలువాది చిన సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఏఎస్‌కేవీ రంగారెడ్డి అధ్యక్షతన ఆదివారం అయ్యప్పస్వామి మాలధారులు, గాయత్రి పరివార్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. దేవాలయాలు, దేవదాయ శాఖలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలని, దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కల్పించి, స్వయంప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు తొమ్మంద్రు సత్యనారాయణ, సుబ్బారావు, వీహెచ్‌పీ నాయకులు, గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొన్నారు.

నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు

బెల్లంకొండ: నాటు సారా తయారు చేసినా, ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ డి.ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో నాటు సారా, తెలంగాణ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి పలుచోట్ల ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎటువంటి మద్యం లభించలేదని తెలిపారు. అనంతరం ప్రధాన సెంటర్లో గ్రామస్తులతో మాట్లాడారు. నాటు సారా విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్ఐ వెంట కానిస్టేబుళ్లు రాజేష్, వెంకట్రావు, శ్రీను ఉన్నారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల స్వీకరణ'

బెల్లంకొండ: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అఫ్రున్నీసా బేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఇక నుంచి ప్రతి సోమవారం మండల కేంద్రాల్లోనూ జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, మండల ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయాలని తెలిపారు.

మహిళను వేధించిన కేసులో వ్యక్తి అరెస్టు

పిడుగురాళ్ల: మహిళను వేధించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణంలో ఓ సచివాలయంలో ఏఎన్ఎంగా పని చేస్తున్న కరిమున్నిసాను పి.సురేష్ అనే వ్యక్తి వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈమేరకు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు.

స్వాములకు సద్ది వితరణ

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవాసమితి మండపంలో ఆదివారం గుండారాము దంపతులు వేద పండితులు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి 350 మంది స్వాములకు సద్ది ఏర్పాటుచేశారు. శివాలయం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, అంబటి శ్రీనివాసరెడ్డి, పటాల సుబ్బారావు గురుస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



కరపత్రాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

అచ్చంపేట: రాష్ట్రంలో జరుగుతున్న మహిళలపై దాడులను అరికట్టాలని సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా పోరు ప్రచార యాత్ర నిర్వహించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రావెల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలను, దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దోషుల ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నానాటికి పెరిగిపోతున్నాయని, నియంత్రించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించాలి డిమాండ్ చేశారు. అచ్చంపేటలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, కేకే రెడ్డి, షేక్ హసన్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం తప్పనిసరి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ పద్మ, జెడ్పీటీసీ చంద్రకళ

ముప్పాళ్ళ: గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీపీ మారూరి పద్మ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తహసీల్దార్ ఎం. భవానిశంకర్ మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యతని అన్నారు. ఎంపీడీవో పీజే విలియమ్స్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల పని తీరును వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు శిరిగిరి చంద్రకళ, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందేలా కృషి



వరి పంటను పరిశీలిస్తున్న మిర్చి యార్డు మాజీ చైర్మన్ సాంబశివారెడ్డి

బెల్లంకొండ: బెల్లంకొండ–ఎర్రబాలెం మేజర్ కాలువ గట్టుకు గండి పడటంతో మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో కొట్టుకుపోయిన వరి పొలాలను గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి ఆదివారం స్థానిక టీడీపీ నాయకులతో కలసి పరిశీలించారు. వరి పైరు కోతకు వచ్చిన సమయంలో ఇటువంటి ఘటన జరగడం శోచనీయమన్నారు. ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం కారణంగానే కాలువలకు గండ్లు పడుతున్నాయని, రెండుమూడు రోజుల్లో కోతకు వచ్చిన పంటను నష్ట పోయామని రైతులు ఆయనకు తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కెనాల్ అధికారులు, సిబ్బందిపై సాంబశివారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకు వెళ్తానని, పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందేలా చూస్తానని రైతులకు భరోసానిచ్చారు. గ్రామ మాజీ సర్పంచ్ బూతుకూరి తిరుపతిరెడ్డి, టీడీపీ నాయకులున్నారు.

పేద విద్యార్థులకు ఉచిత వేద విద్య



అధ్యయనం చేస్తున్న విద్యార్థులు

అమరావతి: పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉచితంగా వేద విద్యను అందించేందుకు అమరావతిలో వేద పాఠశాలను ఈ నెల 20న ప్రారంభిస్తున్నట్లు వేద పాఠశాల వ్యవస్థాపకుడు ఘంటశాల చంద్రమౌళీ శర్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల క్రితం మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో శ్రీ గీతా వెంకటేశ్వర కృష్ణ యజుస్మార్త ఆగమ పాఠశాల స్థాపించామన్నారు. ఈ పాఠశాలలో నేడు 60 విద్యార్థులకు ఉచితంగా భోజన, వసతితో వేద విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది విద్యార్థులకు పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేద అధ్యయనం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో సుమారు ఆరు సంవత్సరాల నుంచి చేస్తున్న కృషి నేటికి ఫలించిందన్నారు. అమరావతి వేద పాఠశాలలో వంద మందికిపైగా భోజన, వసతి వంటి సకల సౌకర్యాలతో భవనం నిర్మాణం చేశామని తెలిపారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉచితంగా పాఠశాల ప్రవేశం కల్పించి, వేద విద్య, స్మార్త అగమ విద్యను ఉచితంగా అందించడానికి దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్రహ్మశ్రీ సత్యనారాయణ అవధాని ఉదయం 8 గంటలకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



వెల్లటూరులో పుస్తక పంపిణీ ప్రచారం

బొల్లాపల్లి : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని వెల్లటూరులో ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంతో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్తిక మాసం విశిష్టత గురించి వివరించారు. ఈ మాసంలో కార్తిక పౌర్ణమి రోజున దేవాలయాల్లోని ధ్వజ స్తంభం పైన దీపం వెలిగించడం వల్ల భగవంతుని అనుగ్రహం లభిస్తుందని కమిటీ సభ్యులు కె.సైదారావు తెలిపారు. కార్తిక మాసం డిసెంబరు ఒకటి వరకు ఉంటుందని, భక్తిశ్రద్ధలతో దీపారాధన చేయాలని తెలిపారు. గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, ప్రబోధ పుస్తక పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.అరుణ, కె.కార్తిక్, కె.నారాయణమ్మ, సీహెచ్. అనురాధ, ఎన్. వెంకటలక్ష్మి, డి. శ్రీను, ఎం. వీరయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



శావల్యాపురం: ఉపాధ్యాయులు ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య ప్రచార కమిటీ అధ్యక్షులు గాలి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని కనమర్లపూడి గ్రామ పరిధిలోని సంసిద్ పాఠశాల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు తిలకించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఒంటేరు నాగ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.